సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



కొండగట్టు మాస్టర్ ప్లాన్‌పై కలెక్టర్ యాస్మిన్‌బాషా, అధికారులతో చర్చిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

ప్రజల వద్దకే పాలన

- పారదర్శకంగా ప్రజాపాలన
- వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్లలో మొదటి రోజు 1,159 దరఖాస్తులు



వేములవాడలో దరఖాస్తు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ/చందుర్తి : అర్హులైన పేదలకు ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలనను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని వేములవాడలోని 3, 4 వార్డులు, చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో గురువారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజల స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలోని వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. తమ వద్దకే అధికారులు, సిబ్బంది చేరుకుని దరఖాస్తులు తీసుకుంటారని, ఒకవేళ తమ వద్దకు వచ్చిన సమయంలో తామంతా అందుబాటులో లేకున్నా ఈ నెల 6వ తేదీ వరకు ఆయా మున్సిపల్, గ్రామపంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేశామని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజాపాలన గ్రామ సభలలో ఆరు గ్యారంటీల దరఖాస్తులతోపాటు ఇతర సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తే వాటిని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుకున్న మార్పును వారికి అందించే దిశగా ప్రజాప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. తహసీల్దార్ మహేశ్, కౌన్సిలర్లు మారం కుమార్, వంగల దివ్య, చందుర్తిలో జెడ్పీటీసీ నాగం కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా అమలు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించే ఉద్దేశంతోనే 'ప్రజాపాలన' నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల ఆర్డీవో ఆనందకుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని రెండో వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మూడోవార్డులో ప్రజాపాలనను ప్రారంభించి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా పాలన చేపట్టారన్నారు. ప్రస్తుతం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, టీపీవో అన్సార్, టౌన్ సీఐ ఉపేందర్ పాల్గొన్నారు.



కొలనూర్‌లో పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



సిరిసిల్లలో దరఖాస్తు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ కళ

ప్రజాపాలనను వినియోగించుకోవాలి

కోనరావుపేట(వేములవాడ): తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని కొలనూర్, గొల్లపల్లి, బావుసాయిపేట, గోవిందరావుపేటతండాలో ప్రజాపాలనను గురువారం ప్రారంభించారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, మండల ప్రత్యేకాధికారి కొండల్‌రావు, ఏవో వెంకట్రామమ్మ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో జోగం రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన బాగుంది

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/వేములవాడరూరల్: జిల్లాలో మొదటి రోజు ప్రజాపాలనకు స్పందన బాగుందని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించి మాట్లాడారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని జనాభాను బట్టి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాపాలన పరిశీలన

వేములవాడరూరల్ మండలంలోని బొల్లారం, వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో జరిగిన ప్రజాపాలనను అడిషనల్ కలెక్టర్ గౌతమి పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు వేములవాడ మండల పరిషత్‌లో అవగాహన కల్పించారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, ఏడీ సైదులు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

రైతులకు ఉచితంగా కోడెలు



వేములవాడ: రాజన్న గోశాలలోని కోడెలను 10 మంది రైతులకు ఉచితంగా గురువారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక రమేశ్ మాట్లాడుతూ కోడెలను రైతులు వ్యవసాయానికి వాడుకోవాలని, సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించుకోవాలని సూచించారు. గోశాల రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీశ్, మహేశ్, ప్రశాంత్, రామకృష్ణ, రాంరెడ్డి, శ్రీనివాస్, లింగయ్య, నారాయణ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సింగసముద్రం ఆయకట్టు రైతులు సాగునీటిని వృథా చేయకుండా చివరి ఆయకట్టు వరకు పంటలు పండేలా పొదుపుగా వాడుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట శివారులోని సింగసముద్రం నుంచి గురువారం సాగునీటిని విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలోని రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, కోరుట్లపేట, సర్వాయిపల్లికి చెందిన 1,600 ఎకరాలకు సరిపడేలా నీటిని విడుదల చేశారు. సర్పంచులు నేవూరి వెంకట్‌రెడ్డి, కొండాపురం బాల్‌రెడ్డి, దేవానందం, రాజిరెడ్డి, బాల్‌రాజ్, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

రాజీయే రాజమార్గం

- 30న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా న్యాయమూర్తి ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్లటౌన్: రాజీయే రాజమార్గమని జిల్లా న్యాయమూర్తి ప్రేమలత పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో గురువారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్న కేసుల సత్వర పరిష్కారం కోసం జిల్లా ప్రజలకు ఈనెల 30న జరిగే జాతీయ లోక్‌అదాలత్ ఒక సదవకాశమన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీ పడే అవకాశం ఉన్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, చిన్నపాటి ఆస్తి తదితర తగాదాల కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 914 కేసులు ఉన్నట్లు తెలిపారు. వాటిలో అత్యధికంగా రాజీపడేందుకు జిల్లా పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా కోర్టు సూపరింటెండెంట్ వామన్‌రావు, మండల న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులున్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

- సర్కారు వైద్యంపై నమ్మకం పెంచాలి
- ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరిస్తాం
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లా ఆస్పత్రిలో సమీక్షా సమావేశం



ఆస్పత్రిలో అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: కరోనాపై జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగిందని, ఆ నమ్మకాన్ని పదిలపర్చుకోవాలని సూచించారు. కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో చికిత్సకు కావాల్సిన టెస్టుల కిట్లు, మందులు, బెడ్స్, ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ గుగులోతు కళావతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు సమస్యలను జెడ్పీచైర్‌పర్సన్ దృష్టికి సిబ్బంది తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



పల్లెలు రక్తసిక్తం

ఈ ఏడాది వరుస హత్యలతో జిల్లా ప్రజలు వణికిపోయారు. చిన్న..చిన్న కారణాలతోనే ప్రాణాలు తీసుకున్నారు. పగలు.. ప్రతీకారాలు.. వివాహేతర సంబంధాలతో హత్యలు జరిగాయి. దొంగలు సైతం ఇళ్లను గుల్ల చేశారు. ఇక సైబర్‌నేరాలు లెక్కకు మించి జరిగాయి.

10లో▸

నేతల రాక.. రాజకీయ కాక

- అసెంబ్లీ ఎన్నికల ఏడాదిలో వరుస పర్యటనలు
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో పొలిటికల్ హీట్
- ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆకస్మిక బదిలీలు
- శాసన సమరంలో అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్
- ఉమ్మడి జిల్లాలో 8 సీట్లు గెలిచి, అధికారంలోకి..
- బీఆర్‌ఎస్‌కు 5 సీట్లు.. ఖాతా తెరవని బీజేపీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఈ ఏడాది పలు పార్టీల అగ్రనేతలు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సంవత్సరం కావడంతో ఆందోళనలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది. ఐఏఎస్, ఐపీఎస్‌ల అనూహ్య బదిలీలు జరిగాయి. మొదటి ఆరు నెలల్లో పలు అభివృద్ధి పనులు, మెడికల్ కాలేజీలు, కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్‌ఎస్ బిజీగా గడిపింది. కర్ణాటక ఎన్నికల్లో సాధించిన విజయంతో కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. తర్వాత ఆరు నెలల్లో రాజకీయ వేడి పెరిగింది. అభ్యర్థుల కూర్పు, ప్రకటన, ఎన్నికల ప్రచారం, ప్రధాని నుంచి ముఖ్యమంత్రి, జాతీయ నేతలు తదితరులు ప్రచారం చేశారు. శాసన సమరంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ 8 సీట్లు గెలిచి, అధికారంలోకి రాగా, బీఆర్‌ఎస్ కేవలం 5 సీట్లకు పరిమితమైంది. బీజేపీ ఖాతా తెరవలేకపోయింది.



ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ సంజయ్



ఎన్నికల సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ యాత్ర

జనవరి 16: మంత్రి గంగులకు సీఎం పరామర్శ.. మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య మరణించడంతో ఆయన పెద్దకర్మకు సీఎం కేసీఆర్ వచ్చారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులను ఓదార్చి, 10 నిమిషాల్లోనే పర్యటన ముగించుకున్నారు.

జనవరి 25: బీఆర్‌ఎస్‌ను వీడిన భోగ శ్రావణి.. జగిత్యాల మున్సిపాలిటీలో అసమ్మతి పుట్టింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో విభేదాల కారణంగా శ్రావణి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి, బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మార్చిలో బీజేపీలో చేరారు.

జనవరి 26: సీపీలు, ఎస్పీల బదిలీ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు పోలీసు బాస్‌ల బదిలీలు జరిగాయి. కరీంనగర్ సీపీగా ఎల్.సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, జగిత్యాల ఎస్పీగా భాస్కర్, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఉన్న సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, సింధూశర్మ, రాహుల్ హెగ్డేలు బదిలీ అయ్యారు.

జనవరి 30: ఇతర నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఎంపీ బండి సంజయ్ వర్గం ఖండించింది. కరీంనగర్ అసెంబ్లీ బరిలో ఉంటారని 'సాక్షి'కి లీకులిచ్చింది.

ఫిబ్రవరి 03: రైల్వే బడ్జెట్‌లో రూ.647 కోట్లు.. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఈసారి రైల్వే ప్రాజెక్టులకు పెద్దపీట వేశారు. రూ.647 కోట్లు కేటాయించారు.

ఫిబ్రవరి 15: అంజనాద్రి మాస్టర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు.. జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో సీఎం కేసీఆర్ పర్యటించారు. కొండగట్టును అంజనాద్రిగా మారుస్తామన్నారు. సంబంధిత మాస్టర్ ప్లాన్‌కు రూ.600 కోట్లు కేటాయించారు.

మార్చి 08: ఆరోగ్య మహిళకు శ్రీకారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 57 మెడికల్ టెస్టులు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు కరీంనగర్‌లో శ్రీకారం చుట్టారు.

మార్చి 09: కరీంనగర్ కవాతు.. రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు సంఘీభావంగా కరీంనగర్ కవాతు పేరిట కాంగ్రెస్ పార్టీ కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. చత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ బగేల్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీనియర్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్, శ్రీధర్‌బాబు తదితరులు హాజరయ్యారు.



ప్రచార సభలో సీఎం కేసీఆర్, గంగుల

మార్చి 21: గులాబీ సమ్మేళనాలు.. బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో జరిపారు.

మార్చి 23: ఎకరాకు రూ.10 వేలు.. అకాల వర్షాల కారణంగా కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలంలో దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్ పరిశీలించారు. ఎకరానికి రూ.10 వేల పరిహారం ప్రకటించారు.

ఏప్రిల్ 08: ఎంపీ బండికి పరామర్శ.. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో అరెస్టయి, విడుదలైన ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ తీరుపై విరుచుకుపడ్డారు.

ఏప్రిల్ 14: ప్రకాశ్ అంబేడ్కర్ పర్యటన.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన దళితబంధు యూనిట్లను పరిశీలించేందుకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ హుజూరాబాద్‌లో పర్యటించారు.

మే 13: కర్ణాటక ఎన్నికల బూస్టింగ్.. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఉమ్మడి జిల్లా హస్తం పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు.

మే 14: మదర్సాలను రద్దు చేశా : అసోం సీఎం.. హనుమాన్ జయంతి సందర్భంగా ఎంపీ బండి సంజయ్ నిర్వహించిన హిందూ ఏక్తాయాత్రలో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. తాను అసోంలో మదర్సాలను రద్దు చేశానని తెలిపారు.

మే 31: టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనగర్‌లో నిర్మించతలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ నిర్వహించారు.

జూన్ 15: బూట్లు వేసుకోలేదు : ఎంపీ బండి వివరణ.. బీజేపీ నేత ప్రకాశ్ జవడేకర్ వేములవాడ ఆలయంలోకి బూట్లు వేసుకొని వచ్చారన్న ప్రచారం రాజకీయ దుమారం రేగింది. దీనికి ఆయన సాక్సులతో ఆలయంలోకి వచ్చారని ఎంపీ బండి సంజయ్ వివరణ ఇచ్చారు.

జూన్ 21: కేబుల్ బ్రిడ్జి ప్రారంభం.. కరీంనగర్‌లో రూ.220 కోట్లతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

జూన్ 22: పొత్తుల్లేవ్: ఎంపీ సంజయ్.. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

జూలై 16: పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ స్థానంలో ముజమ్మిల్‌ఖాన్ నియమితులయ్యారు.

జూలై 25: కరీంనగర్ కలెక్టర్ కర్ణన్ బదిలీ అవగా, ఆయన స్థానంలో బి.గోపి బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కలెక్టర్లుగా ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ విధుల్లో చేరారు.

సెప్టెంబర్ 5: గంగులకు ఈడీ నోటీసులు.. గ్రానైట్ వ్యాపారంలో మంత్రి గంగుల కమలాకర్ ఫెమా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఈడీ ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు అందజేసింది.

సెప్టెంబర్ 15: మెడికల్ కాలేజీల ప్రారంభం.. సిరిసిల్ల, కరీంనగర్‌లలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

అక్టోబర్ 06: తులం బంగారం.. కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా కల్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తీర్మానం చేసి, అధిష్టానానికి పంపారు.

అక్టోబర్ 28: కరీంనగర్ సీపీ, కలెక్టర్ బదిలీ.. కరీంనగర్ కలెక్టర్ బి.గోపి, సీపీ సుబ్బారాయుడులను ఎన్నికల సంఘం అనూహ్యంగా బదిలీ చేసింది. వీరి స్థానంలో పమేలా సత్పతి, అభిషేక్ మహంతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ నేతల ఫిర్యాదులతో చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

నవంబర్ 23: గాదె ఇన్నయ్య, మావోయిస్టు నేత పుల్లూరి ప్రసాద్‌లపై రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఉపా కేసు నమోదైంది.

జాతీయ, రాష్ట్ర నేతల సందడి

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో నవంబర్ నెలలో పలువురు జాతీయ, రాష్ట్ర నేతలు తరలివచ్చారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, యూపీ సీఎం యోగి, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మాజీ సీఎం మాయావతి, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించారు.



కరీంనగర్ తీగల వంతెనను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, గంగుల (ఫైల్)



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శ్రావణి(ఫైల్)

క్లుప్తంగా

లింగన్నపేట పీహెచ్‌సీలో కేంద్ర బృందం



కేంద్ర బృందం అధికారులతో పీహెచ్‌సీ సిబ్బంది

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం అధికారులు గురువారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఫార్మసీ, లేబర్ రూమ్, ఓపీ, ఇన్‌పేషంట్ వార్డులు, రికార్డులు, సబ్‌సెంటర్ రికార్డులు తదితర అంశాలను పరిశీలించారు. కేంద్ర బృందంలో మనీశ్‌కుమార్, ప్రియాంక జయన్, వైద్యాధికారులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, సీహెచ్‌వో రమేశ్ ఉన్నారు.

అక్షింతలతో శోభాయాత్ర



నర్మాలలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన రాములోరి అక్షింతలతో గురువారం గంభీరావుపేట మండలం నర్మాలలో శోభాయాత్ర నిర్వహించారు.

రాజన్న సేవలో ఏఐసీసీ సెక్రటరీ



కోడెమొక్కు చెల్లిస్తున్న ఏఐసీసీ సెక్రటరీ శ్రీనివాస కృష్ణయాన్

వేములవాడ: ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస కృష్ణయాన్ దంపతులు గురువారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, గోలి శ్రీనివాస్ వేదోక్త ఆశీర్వచనం గావించారు.

గోశాలలకు కోడెల తరలింపు



కోడెలను అప్పగిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి భక్తుల ద్వారా మొక్కుబడిగా వచ్చిన కోడెలను గోశాలలకు అప్పగించారు. తిప్పాపూర్ గోశాల నుంచి 20 కోడెలను వేములవాడలోని ప్రైవేటు గోశాలకు అప్పగించారు. ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ నర్సింహమూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని పార్కులు, డివైడర్ల గ్రీనరీ పెంచే కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ ఎదుట గురువారం నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. పట్టణంలోని పార్కులు, డివైడర్లు, సర్కిళ్లు, శానిటేషన్, క్లీనింగ్, గ్రీనరీ, ప్లాంటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 50 మంది కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. ఈమేరకు కార్మికులు పనులు బంద్ చేసినా పాలకవర్గం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో కార్మికులు నర్సయ్య, శారద, ఇందిర, అనసూర్య, లక్ష్మి, ఎల్లవ్వ, శ్రీకాంత్, కళ్యాణ్, కనకవ్వ, వంశీ, ప్రియాంక, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు రక్తసిక్తం

- వరుస హత్యలతో వణికిన జిల్లా ప్రజలు
- దొంగల బీభత్సంతో భీతిల్లిన ఖైనం
- జిల్లాలో పెరిగిన సైబర్ నేరాలు
- ఛేదించిన పోలీసులు
- కొత్త ఆలోచనలతో ముందుకు..

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పల్లెలు ఎరుపెక్కాయి. వరుస హత్యలతో ప్రజలు భయాందోళన చెందారు. దారిపక్కనే ఉన్న ఇళ్లు దోపిడీకి గురవడంతో భీతిల్లిపోయారు. 2023వ సంవత్సరంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలో నెలకో హత్య చొప్పున జరిగాయి. వివాహేతర సంబంధాలు.. ఆస్తి, భూతగాదాలు.. పగలు ప్రతీకారాలతో ప్రాణాలు తీసుకున్నారు. ఒక పక్క పోలీసులు నేరాల అదుపునకు కొత్త ఆలోచనలతో ముందుకెళ్తే.. అంతే చాకచక్యంగా సైబర్ నేరగాళ్ల జిల్లా ప్రజలను దోపిడీకి గురిచేశారు. సిరిసిల్లలో వరదలు వచ్చిన సమయంలో పోలీసుల సేవలు శభాష్ అనిపించుకున్నాయి.



మానేరునదిలో మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు (ఫైల్)



హత్యకు గురైన యువకుడు (ఫైల్)

ఎస్పీ అఖిల్‌మహాజన్ మార్క్‌తో..

రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ జనవరి 26న బాధ్యతలు స్వీకరించారు. నేరాల నియంత్రణలో తన మార్క్ చూపెడుతూ ముందుకెళ్లారు. సిరిసిల్లను వరదలు ముంచెత్తిన సమయంలో ప్రజల వెన్నంటి ఉండి పోలీసులు చేసిన సేవలకు స్థానికుల నుంచి అభినందలు దక్కాయి. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలోనూ పోలీసులు తమ మార్క్ చూపెట్టారు.

జిల్లాలో జోరుగా బెల్టుషాపులు

జిల్లాలోని ప్రతీ పల్లెలో బెల్టుషాపులు జోరుగా వెలశాయి. బెల్టుషాపులను నివారించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే స్థానికుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. అదే పోలీసులు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బెల్టుషాపులపై కొరడా ఝులిపించారు. అయితే ఎన్నికలు ముగియడంతోనే మళ్లీ యథావిధిగా పల్లెలను బెల్టు మద్యం మత్తు ముంచెత్తుతోంది. అంతేకాకుండా అక్రమ ఇసుకదందా, నకిలీ వీసాల మోసం, సైబర్‌మోసాలకు చెక్ పడలేదు. కానీ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి ఫిర్యాదు చేస్తేనే రికవరీ చేసి ఇచ్చారు.

మార్పు కోసం కొత్త కార్యక్రమాలు

- జిల్లా పోలీసుశాఖ ఈ ఏడాది ఆరంభంలో విధుల్లో చేరిన ఎస్పీ అఖిల్ మహాజన్ ముందుగా జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు ‘మెసేజ్ యువర్ ఎస్పీ’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 63039 22572 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.
- మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీమ్ 87126 56425ను ఏర్పాటు చేశారు.
- గల్ఫ్ మోసాలను అరికట్టేందుకు 87126 56411 నంబర్‌తో సీఐ స్థాయి అధికారిని నియమించారు.
- ఏప్రిల్ 4న వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో థాణా దివస్ (ప్రతి నెల మొదటి మంగళవారం) నిర్వహించారు. ప్రారంభంలో ఉన్న ఉత్సాహం క్రమంగా తగ్గిందనే విమర్శలు ఉన్నాయి.
- ఏప్రిల్ 19న పోలీస్ సిబ్బంది పనితీరును లెక్కించేందుకు క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చి.. 63039 22572 నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు.
- జూన్ 13న మహిళల ఆత్మరక్షణకు ఆపరేషన్ జ్వాలా(సెల్ఫ్ డిఫెన్స్) కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలోని విద్యాలయాల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- విద్యార్థులు, మహిళలు వెళ్లే సమయంలో వారి రక్షణకు ‘సేఫ్ ఆటో’ అప్లికేషన్‌ను మే 2న ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ఆటోలకు వీటిని వర్తింపచేయలేదన్న విమర్శలు ఉన్నాయి.
- సమస్యలున్న ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు రావడం కాదని పోలీసులే ప్రజల చెంతకు వెళ్లి సేవలందించాలని జూన్ 17 ‘మొబైల్ థాణా’కు ఎస్పీ అఖిల్‌మహాజన్ శ్రీకారం చుట్టారు. దీనిని పునర్ సమీక్షించిన విధానాలు లేవన్న విమర్శలు ఉన్నాయి.
- గంజాయిని నివారించేందుకు జూలై 5న యాంటీ డ్రగ్స్ క్లబ్స్ ఏర్పాటు చేశారు.

గంజాయి, సైబర్ నేరస్తుల పట్టివేతలో..

జిల్లాలో గతంలో కంటే గంజాయి విక్రయాలు పెరిగినట్లు తెలుస్తోంది. అయితే అంతేస్థాయిలో పోలీసులు సైతం నివారణ చర్యలు తీసుకున్నారు. సాంకేతిక రంగంలో జరుగుతున్న సైబర్ నేరాలను ఆదిలోనే పట్టుకున్నవి కొన్ని కాగా అంతర్‌రాష్ట్ర స్థాయిలో జరిగిన నేరాలను పసిగట్టి పట్టుకున్న తీరుతో పోలీసుశాఖ శభాష్ అనిపించుకుంది.

హత్యాకాండలు..

- సిరిసిల్ల డివిజన్ పరిధిలో మే 28న ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన దరిపల్లి శంకర్‌ను అతని భార్య, కొడుకు కలిసి ఆస్తి కోసం హత్య చేశారు.
- మార్చి 3న సహజీవనం చేస్తున్న మహిళ కూతుళ్లను శారీరకంగా అనుభవించాలని చూసిన ప్రియున్ని అల్లుడితో కలిసి గౌరవ్వ అనే మహిళ చంపింది.
- తనను అనుమానిస్తున్నాడని భర్తను మరికొందరితో సుపారీ ఇచ్చి కనకవ్వ మహిళ హత్య చేసి మానేరువాగులో పూడ్చిపెట్టింది.
- సిరిసిల్లలోని వెంకంపేటలో భర్తను భార్య అతని కూతురు బంధువులు కలిసి దృశ్యం సినిమాను మించిన విధానంలో హత్య చేశారు. ఇది జిల్లాలో అత్యంత పాశవికంగా జరిగిన హత్యగా నిలిచింది.

వేములవాడ డివిజన్‌లో..

- ఫిబ్రవరి 7న రుద్రంగికి చెందిన రణవేని గణేశ్‌ను భార్య, అత్తింటివాళ్లు గొడ్డలితో నరికిచంపారు.
- సెప్టెంబర్ 13న మల్యాల గ్రామానికి చెందిన పడిగెల నరేశ్‌ను అదే గ్రామానికి చెందిన మల్లేశం కత్తితో దాడి చేసి చంపాడు.
- సెప్టెంబర్ 27న చందుర్తిలో పులి గంగారంను అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు బండరాయితో మోది చంపాడు.

కేసుల వివరాలు ఇలా..

ఏదాది	కేసులు	అరెస్ట్‌లు	గంజాయి సీజ్ (కిలోలు..)
2022	16	54	3.773
2023	59	127	70.793

కేసులు ఇలా..

కేసు	2022	2023
రోడ్డుప్రమాదాలు	197	218
సైబర్ నేరాలు	67	80
డ్రంకెన్‌డ్రైవ్	3,642	7,574

ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తాం



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తాం. ప్రజలందరూ చట్టపరిధిలో వారికి ఉన్న అవసరాలను తీర్చుకోవాలి. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్య ఉన్న వాళ్లు నేరుగా ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయాలి.

– అఖిల్ మహాజన్, సిరిసిల్ల, ఎస్పీ

ఆరోగ్య యోజన కార్డులు పొందాలి

- అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వికసిత్ భారత్
- జాతీయ ఆరోగ్య మిషన్ డిప్యూటీ కమిషనర్ సుశీల్ విమల్



ఆవునూర్‌లో పరిశీలిస్తున్న సుశీల్ విమల్

సిరిసిల్లటౌన్: ప్రధానమంత్రి ఆరోగ్య యోజనకార్డులను నిరుపేదలు పొందాలని కేంద్ర మంత్రిత్వశాఖ జాతీయ ఆరోగ్య మిషన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్ పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, ముస్తాబాద్ మండలం ఆవునూరు, వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రలో మాట్లాడారు. ఆరోగ్య భారత్‌లో భాగంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 30 ఏళ్లు నిండిన వారిని గుర్తించి అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటిక్ పరీక్షలు చేసి వ్యాధులు ఉన్నవారికి పీహెచ్‌సీల్లో ఉచిత వైద్యం పొందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. క్షయ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఆరోగ్య యోజన కార్డులతో ఉచిత వైద్యబీమా పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు, వైద్యాధికారుల మధ్య సమాచార లోపాన్ని తొలగించడానికి వికసిత్ సంకల్ప్ యాత్ర పనిచేస్తుందన్నారు. యాత్రలో భాగంగా వచ్చిన ప్రజలతో నేరుగా ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. జాతీయ అర్బన్ హెల్త్ మిషన్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్యాంషి, రాష్ట్ర అర్బన్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రంజిత్, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, డాటా మేనేజర్ కార్తీక్, బాలచంద్రం, లింగం పాల్గొన్నారు.

ఆరోగ్యకార్డులు ఎందుకు ఇవ్వడం లేదు?

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి హెల్త్‌కార్డులను ఎందుకు జారీ చేయడం లేదని డిప్యూటీ హెల్త్ కమిషనర్ డాక్టర్ సుశీల్‌విమల్ ప్రశ్నించారు. మండలంలోని ఆవునూర్‌లో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రను గురువారం సందర్శించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై వెంటనే ఆరోగ్య కార్డులను అందజేయాలన్నారు. నామమాత్రంగా శిబిరాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ రంజిత్, ఎంపీడీవో రమాదేవి, డాక్టర్ దివ్యా జీ, డాక్టర్ రజిత, వైద్యాధికారి గీతాంజలి, సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత ఉన్నారు.

ఉద్యోగాలను భర్తీ చేస్తాం

- జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రకటనలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్లలో కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు
- పార్టీ జెండా ఆవిష్కరణ



అగ్రహారం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ముందుకెళ్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన ఆరు గ్యారెంటీల అమలు పక్కాగా జరుగుతుందన్నారు. యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిల్లో రాణించాలన్నారు. ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా యువకులు నైపుణ్యాలను, కంప్యూటర్ స్కిల్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జాబ్ మేళాలో సుమారు 250 మంది యువత పాల్గొన్నారని టీఎస్ కేసీ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కీర్తి రాజేశ్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీమధు రాజేశ్, కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే లక్ష్యం

సిరిసిల్లటౌన్: సంక్షేమ పాలనే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో గురువారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పేదల అభ్యున్నతికి అంకితమైందన్నారు. ఇందిరాగాంధీ కాలం నుంచి గరీబీ హటావో నినాదంతో పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర, జిల్లా నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, కాముని వనిత, వెల్ముల స్వరూప, మడుపు శ్రీదేవి, సూర దేవరాజు, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- పొగమంచుతో ప్రమాదం
- మిడ్‌మానేర్ వంతెనపై మూడు లారీలు ధ్వంసం




దెబ్బతిన్న లారీలు

బోయినపల్లి(చొప్పదండి): పొగమంచుతో రోడ్డు కనిపించకపోవడంతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ఢీకొట్టిన రెండో లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు లారీలు ధ్వంసమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ లారీని పొగమంచుతో రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో ఫోర్‌లేన్ బ్రిడ్జి ఫెన్సింగ్ పరిసరాల్లో ఆపారు. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనంతరం ఈ ఢీకొన్న లారీని మూడో లారీ ఢీకొట్టడంతో అన్నీ ధ్వంసమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

- 21 రోజులు మృత్యువుతో పోరాటం



ఇబ్రహీం మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర శివారులోని బ్రిడ్జి వద్ద ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన మహమ్మద్ ఇబ్రహీం(20) ఈనెల 7న సిరిసిల్ల వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్నాడు. పదిర బ్రిడ్జి వద్ద ఆటో, బైక్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇబ్రహీంను కుటుంబ సభ్యులు మొదట రామాయంపేటలోని ఓ ఆయుర్వేద ఆస్పత్రిలో చేర్చారు. ఈక్రమంలోనే ఈనెల 24న పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



రమేశ్ మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): బైక్ అదుపుతప్పి పొలంలో పడిపోగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన పిట్టల రమేశ్ (32) గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం వ్యవసాయ పనులకు వెళ్లి బైక్‌పై ఇంటికొస్తున్నాడు. కొండాపూర్ స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన మూడు గజాల లోతులో ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. పొలంలో బోర్లాపడడంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతునికి భార్య రేణ, కుమారుడు చరణ్, కూతురు శరణ్య ఉన్నారు. నాలుగేళ్ల క్రితం సిలిండర్ పేలడంతో ఇల్లు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో రేపాక పోచవ్వ(65) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. పోచవ్వ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. గురువారం ఇంట్లోనే క్రిమిసంహారకమందు తాగింది. గమనించిన ఆమె భర్త భగవాన్ వేములవాడలోని తన కొడుకుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆమెను 108లో వేములవాడకు తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందింది. కుమారుడు లింగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మారుతి తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో భార్యభర్తల వివాదం విషయంలో పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతున్న క్రమంలో అనుప రజిత ఆమె కుమారులు, తల్లిపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. అనుప రజిత తన భర్త అంజయ్య మధ్య గొడవలు ఉన్నాయి. ఈ విషయంలో కులపెద్దలు ఈనెల 23న పంచాయితీ నిర్వహిస్తుండగా.. అక్కడే ఉన్న తన భర్త అంజయ్యతోపాటు అనుప మల్లయ్య, అనుప పర్శయ్య, అనుప ఎల్లయ్యలు కలిసి తన ఇద్దరు కొడుకులతోపాటు తన తల్లి నర్సవ్వపై దాడి చేశారని ఫిర్యాదు చేసింది. రజిత ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీటీం జిల్లా అధికారి ప్రమీల

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థినులు, మహిళలు సోషల్‌మీడియాపై అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ జిల్లా పోలీస్ అధికారి ప్రమీల సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లలో వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని రాచర్ల జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆకతాయిలు, ఇతరత్ర వేధింపులు ఎదురైతే వెంటనే 87126 56425 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ శైలజ, డైరెక్టర్ ఏలూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సులు పెంచాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లటౌన్: విద్యాసంస్థల సమయానికి ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్‌కు గురువారం వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా బస్సుల్లో జనాలు రద్దీగా ఉంటున్న నేపథ్యంలో విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరలేకపోతున్నారన్నారు. బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఏబీవీపీ సిరిసిల్ల టౌన్ సెక్రటరీ కొమిరె శివసాయి, లోపెల్లి రాజు, ఒగ్గు అనిల్, కట్ట రాహుల్ పాల్గొన్నారు.

వైన్‌షాపులో దొంగతనం

- రూ.36వేలు అపహరణ
- రూ.29వేల విలువ గల మద్యం చోరీ



వైన్‌షాపులో సీసీ పుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మొదటి బైపాస్‌రోడ్డులో గల శ్రీలక్ష్మీనరసింహ వైన్‌షాపులో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. వైన్‌షాపులో ఉన్న రూ.36 వేల నగదు, రూ.29వేల విలువ చేసే మద్యం బాటిళ్లను, ఒక సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. సీసీ పుటేజీల ఆధారంగా దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బుధవారం రాత్రి వైన్స్ నిర్వాహకులు షాపును బంద్‌చేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తి ముసుగు ధరించి గడ్డపారతో షాపు తాళాలు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించాడు. అదే గడ్డపారతో క్యాష్ కౌంటర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.36వేల నగదు ఎత్తుకెళ్లాడు. అంతేకాకుండా దుకాణంలోని రూ.29వేల మద్యం బాటిళ్లను సైతం అపహరించుకెళ్లాడు. సమాచారం అందుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపడుతున్నారు. రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన వైన్స్ యజమాని చిదుగు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

నిబంధనల పాతర.. మందుబాబుల జాతర



చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలోని వైన్స్ యజమానులు నిబంధనలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపు ఎదుటే బెంచీలు ఏర్పాటు చేసి మరీ మద్యం సిట్టింగ్‌లు పెడుతున్నారు. చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వైన్స్ ఎదుట బెంచీలు, టేబుళ్లను పెట్టి బహిరంగంగా ఏర్పాటు చేయడంతో మందుబాబులు అక్కడే మద్యం తాగుతున్నారు. ఈ వ్యవహారంతో తాము ఇబ్బందులు పడుతున్నామని సమీపంలోని ఎస్సీకాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.